క్లుప్తంగా

మండల కమిటీ ఎన్నిక


శ్రీకాంత్, అధ్యక్షుడు


శేఖర్, ప్రధాన కార్యదర్శి

మల్హర్: కారోబార్, గ్రామ పంచాయతీ సిబ్బంది సంఘం మండల కమిటీని కారోబార్ బిల్ కలెక్టర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు సాదుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా అజ్మత్ అలీ, అధ్యక్షుడిగా కనుకల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా గాదేవెన సాగర్, ప్రధాన కార్యదర్శిగా నార శేఖర్, ముఖ్య సలహాదారులుగా విజయగిరి బాపు, ఎండీ కమలోద్దీన్, కోశాధికారిగా అజ్మత్ అలీ, సంయుక్త కార్యదర్శులుగా బడికెల రాజయ్య, ఎండీ అజ్మీర్‌పాషా, కోఆప్షన్ సభ్యుడిగా ఇప్ప రవీందర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నియామకం


కిషన్‌రావు

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ బొంపెల్లి కిషన్ రావును ఆర్‌ఎంపీ, పీఎంపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా కమిటీకి కిషన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

10న లోక్ అదాలత్

మహాముత్తారం: జూన్ 10న జిల్లా కేంద్రంలోని కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రకాల కేసులను రాజీ చేసుకునేందుకు కోర్టు జూన్1నుండి 10వరకు వాదులు ప్రవాదులు కోర్టుకు హాజరైనట్లయితే కేసులను పూర్తిగా కొట్టివేస్తారని అన్నారు. లోక్ అదాలత్‌లో కొట్టుకున్న, భూతగాదాలు, చీటింగ్‌కేసులు రాజీ కోసం ఫిర్యాదు దారులు, నిందితులు ఆధార్ కార్డు తీసుకొని భూపాలపల్లి కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సాయం ప్రకటించడంపై హర్షం

మహదేవపూర్: మండలంలోని కాళేశ్వరం మున్నూరుకాపు నిత్య అన్నదాన సత్రం భవన నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించడంపై ట్రస్ట్ సభ్యుడు, ఫండ్ రైజింగ్ చైర్మన్, మహదేవపూర్ మండల అధ్యక్షుడు సాగర్ల రాజు సోమవార ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిత్యాన్నదానం సత్రానికి ఆర్థిక సాయం ప్రకటించడం అభినందనీయమని అన్నారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి



భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామమైన నాగారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రామినేని సుధాకర్ అనే రైతు ఎద్దు మేత కోసం గ్రామ శివారులోని పంటపొలాల వద్దకు వెళ్లింది. గాలి దుమారానికి విద్యుత్ తీగలు తగిలి ప్రమాదవశాత్తు ఎద్దు అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. ఎద్దు విలువ సుమారురూ. 50 వేల ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు రామినేని సుధాకర్ వేడుకుటుంటున్నాడు.

కరపత్రాల ఆవిష్కరణ

మంగపేట: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం హనుమకొండలో జూన్ 04న నిర్వహించిచే ఎమ్మార్పీఎస్ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ ఇరుగుపైడి మాదిగ పిలుపు నిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కొమురంభీం విగ్రహం వద్ద మహాసభ కరపత్రం ఆవిష్కరణ మండల ఇన్‌చార్జ్ సురేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించడానికి అనుకూలమైన సమయమని ఈ సమయంతో మాదిగలందరం ఏకమై ఉద్యమాన్ని కొనసాగిద్దామన్నారు. హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో ప్రాంగణంలో జరిగే బహిరంగసభలో మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని ప్రతి గ్రామం నుంచి మాదిగ యువతీ యువకులు, మహిళలు, మేధావులు, ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మడిపెల్లి శ్యామ్ బాబు మాదిగ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


మహదేవపూర్: కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచనలు చేస్తున్న రఘువరన్

మహదేవపూర్: మండల ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని డిప్యూటీ జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి రఘువరన్ అన్నారు. కేంద్రంలోని ఎర్ర చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిప్యూటీ జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి రఘువరన్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అల్లం జగ్గయ్య అనే రఘువరన్‌తో సమస్యను తెలుపుకున్నాడు. తను 260 వడ్ల బస్తాలు తీసుకురాగా ఒక్కొక్క బస్తా 38 కేజీలుగా తూకం వేసి 2 కిలోల తరుగు చూపెట్టి అసలు 36 కిలోలుగా ఒక్కొక్క బస్తాకు లెక్క కట్టారని తెలిపారు. తమ బస్తాను డిజిటల్ కాంటాపై తూకం వేయగా 40 కిలోల ఆవరేజ్ వచ్చిందని, బస్తాకు 4 కిలోలు నష్టపోతున్నామని డిప్యూటీ సీఈఓకు తెలిపారు. వెంటనే పరిశీలించిన అధికారి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు లక్ష్మన్‌ను తొలగించాలని, తూకంలో డిజిటల్ కాంట పెట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఎంపీడీవో రవీంద్రనాథ్, రైతులు పాల్గొన్నారు.

కాటారం: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా సాగేలా చూడాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. అంకుషాపూర్, కొత్తపల్లి, ప్రతాపగిరి, గుమ్మాళ్లపల్లి కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎంపీడీఓ పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం రవాణా చేయడానికి ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించినట్లు ఎంపీడీఓ తెలిపారు. లారీల కొరత ఉండటంతో ధాన్యం కేంద్రాల్లోనే ఉంటుందని త్వరగా రవాణా జరిగేలా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. లారీ యజమానులతో మాట్లాడి రవాణా జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.


మహాముత్తారంలో..


కాటారంలో..

కొనుగోలు కేంద్రాల పరిశీలన

మహాముత్తారం: మండలంలోని రేగులగూడెం, నల్లగుంటమీనాజీపేట, మహాముత్తారం గ్రామ పంచాయతీల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్ పరిశీలించారు. ధాన్యం తేమశాతాన్ని పరిశీలించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సెంటర్లలో ధాన్యం తరలించడానికి వాహనాల కొరత ఏర్పడిందని సెంటర్ నిర్వాహకులు రైతులు తమ దృష్టికి తీసుకు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకే కొగుగోలు కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. ఎంపీడీఓ వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

మహదేవపూర్: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది సోమవారం పర్యటించి ఓఆర్‌ఎస్ పాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బయటకు వెళ్లేటప్పుడు శరీరంలో డీహైడ్రేషన్ అయ్యి నీటి శాతం తగ్గి, అధిక తాపం, నీరస పడి, శరీర ఉష్ణోగ్రత పెరగడం వలన ప్రాణాపాయం జరుగుతుందని అన్నారు. శరీరంపై సూర్యకాంతి పడకుండా కప్పిఉండే విధంగా పలుచని కాటన్ దుస్తులను, తలకు రుమాలు, క్యాప్ ధరించి, ఎక్కువ ఓరల్ రేహైడ్రెషన్ సాల్ట్ కలిగిన ఓఆర్‌ఎస్, గ్లూకోజ్ నీటిలో తగిన మొతాదులో కలుపుకొని తాగాలని సూచించారు. అదేవింధంగా వర్షకాలం సమీపిస్తున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. డయేరియా, మలేరియా, డెంగీ, చికెన్ గూన్య, ఫైలేరియా, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతతరం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎక్స్టెంషన్ ఆఫీసర్ స్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజరమణయ్య, ఏఎన్‌ఎంలు హేమలత, వెంకటమ్మ, గ్రామ కార్యదర్శులు సమ్మయ్య, రాజ్ కుమార్, అంగన్వాడీ వర్కర్ సత్యవాణి, వెంకటలక్ష్మి, ఆశ వర్కర్ రుద్ర, శైలజ, మాధవి, ప్రేమలత పాల్గొన్నారు.

నోట్ల మార్పిడిలో బ్యాంకర్ల అత్యుత్సాహం

టేకుమట్ల: రూ.2000 నోట్ల రద్దును కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి నోట్ల మార్పిడిలో బ్యాంకర్ల అత్యుత్సాహం చూపిస్తూ, ప్రభుత్వ నిబంధనలు భేఖాతరు చేస్తూ ఖాతాదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో మండల కేంద్రానికి చెందిన తిరుమల్ అనే ఖాతాదారుడు తన వద్ద ఉన్న రూ.2000 నోట్లను(10,000) తన భార్య ఖాతాలో డిపాజిట్ వేసేందుకు సోమవారం బ్యాంక్‌కు వెళ్లాడు. దీంతో మొదట ఖాతాదారుల ఆధార్ కార్డు కావాలంటూ చెప్పడంతో ఆధార్ కార్డు జిరాక్స్‌తో జిరాక్స్ కాపీపై ఖాతాదారుల సంతకాన్ని సైతం చేపించుకుని వచ్చాడు. అయినా డిపాజిట్ ఓచర్‌పై కూడా ఖాతాదారుల సంతకం కావాలంటూ పలు కొర్రీలు పెట్టడంతో సదరు వ్యక్తి నోట్ల మార్పిడీకి బ్యాంక్‌లకు ప్రభుత్వం అందించిన నిబంధనల పత్రాన్ని చూపించమని కోరగా నీకు చూపించాల్సిన అవసరం లేదని ఏపీజీవీబీ క్యాషియర్ నిర్లక్ష్యపు సమాధానం చెప్పడంతో చేసేదేంలేక తిరిగి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో నగదు జమ చేసుకున్నాడు. ఒక్కో బ్యాంక్‌కు ఒక్కో నిబంధనలను ప్రభుత్వం జారీ చేసిందా అంటూ 'సాక్షి' తో ఆవేదన వ్యక్తం చేసుకున్నాడు. ఈ విషయంపై ఏపీజీవీబీ మేనేజర్ మంగేష్‌ను వివరణ కోరగా డిపాజిట్ చేసే వ్యక్తుల ఆధార్ కార్డును జత చేస్తూ ఎవరి ఖాతాలోనైనా రూ.2000 నోట్లను జమ చేసుకోవచ్చునని, ఖాతాదారుడే బ్యాంక్‌కు రావా ల్సి న అవసరం లేదని, ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ పంతకాని సమ్మయ్య

కాటారం: ప్రభుత్వ వైద్యశాల ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. కాటారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం జనారోగ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆస్పత్రికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఆస్పత్రిలో ఎలక్ట్రిక్ పనులు, సానిటేషన్, స్టేషనరీ ఐటమ్స్ కొనుగోలు, ల్యాబ్‌కు అవసరమయ్యే పరికాల కొనుగోలు తదితర వాటి ఏర్పాటుకు తీర్మానం చేశారు. గతంలో ఆస్పత్రి అభివృద్ధి నిధుల దుర్వినియోగం విషయంలో అప్పటి మండల వైద్యాధికారి డాక్టర్ రామారావుపై సమగ్ర విచారణ చేపట్టి నిధుల రికవరీ చేయాలని తీర్మానం ద్వారా నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులపై సిబ్బంది మర్యాదగా నడుచుకోవడంతో పాటు వారికి కావాల్సిన వైద్య సేవలు సక్రమంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ కొమురయ్య, తహసీల్దార్ జీవాకర్‌రెడ్డి, మండల వైద్యురాలు మౌనిక, ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ, ఐకేపీ వీఓ అధ్యక్షురాలు ఫర్జాన తదితరులు పాల్గొన్నారు.

దాణా బస్తా అందజేత


దాణా బస్తాను అందిస్తున్న రాజు దంపతులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని దుంపిల్లపల్లి గ్రామానికి చెందిన బోయిని రాజు వివాహ వార్షికోత్సవ సందర్భంగా రేగొండ మండలంలోని కోటంచ గోశాల పశువులకు దాణ బస్తాను అందజేశారు. రాజు దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు అభినందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పశుగ్రాసం దగ్ధం


దగ్ధమవుతున్న పశుగ్రాసం

కాటారం: మండలంలలోని ఆదివారంపేట శివారులోని పంట పొలాల్లో ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధమైన సంఘటన సోమవారం చోటు చేసుకొంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ రైతు తన పొలంలోని చెత్తచెదారం పోగు చేసి కాల్చివేశాడు. ప్రమాదవశాత్తు మంటలు పక్క పొలంలోని పశుగ్రాసానికి అంటుకున్నాయి. ఎవరు గమనించకపోవడంతో క్రమంగా మంటలు ఇతర పొలాల్లోకి వ్యాపించడంతో సుమారు 30 ఎకరాల్లో ఉన్న పశుగ్రాసం దగ్ధమైనట్లు పేర్కొన్నారు. రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు.

దగ్ధమైన పంటల పరిశీలన


కాలిపోయిన పంటను పరిశీలిస్తున్న నాయకులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో ఇటీవల ఆకస్మాత్తుగా నిప్పంటుకోని వరి పొలాలు దగ్ధమైయ్యాయి. కాలిపోయిన వరి పొలాలను బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం పరిశీలించి, బాధిత రైతులను పరామర్శించారు. సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి, నాయ్యం జరిగిలే చూస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మండల నాయకులు కోట రవి, వాల యాదగిరిరావు, బత్తుల తిరుపతి, మండల సోషల్ మీడియా ఇంచార్జీ అక్కినవేన సుమన్, ఉప సర్పంచ్ తోట రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్సై అరుణ్

పలిమెల: సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన ఉండాలని ఎస్సై అరుణ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం మండలంలోని కామన్‌పల్లిలో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై అరుణ్ మాట్లాడుతూ.. ఓటీపీలు, పాస్‌వర్డులను కానీ ఇతరులతో పంచుకోవడం చేయవద్దని సూచించారు. ఓఎల్‌ఎక్స్ మోసాలు, ఇతర సైబర్ మోసాలకు గురైన బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. హనీ ట్రాప్‌పై జాగ్రత్త వహించాలన్నారు. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్స్ మిస్సింగ్ కేసులు పెరిగిపోవడంతో సీఈఐఆర్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సివిల్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి


జాబితాను ఎమ్మెల్యేకు అందజేస్తున్న సభ్యులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీచేయాలని ప్రెస్‌క్లబ్ అడహక్ కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని కలిసి వర్కింగ్ జర్నలిస్టుల జాబితాను అందజేశారు. కాకతీయ ప్రెస్‌క్లబ్ అడహక్ కమిటీ కన్వీనర్ నాగపురి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పారదర్శకంగా జర్నలిస్టుల జాబితాను ఎమ్మెల్యేకు అందజేశారు. జాబితాను పరిశీలించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ భూపాలపల్లి తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీచేశారు. జూన్ రెండో తేదీన తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ఇళ్ల స్థలాలపై ప్రకటన ఉంటుందని త్వరితగతిన మూడెకరాల స్థలాన్ని కేటాయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బెల్లం తిరుపతి, ఆరెల్లి నరేందర్, సామల శ్రీనివాస్, జల్ది రమేష్, ఎడ్ల సంతోష్, పసుపుల రాజు, బండ మోహన్, పావుశెట్టి శ్రీనివాస్, బండారి రాజు, క్యాతం సతీష్, శామంతుల శ్యామ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి


కూలీలకు సూచనలు ఇస్తున్న హరీశ్

మల్హర్: మండలంలోని చిన్నతూండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాతంలోని ఉపాధిహామీ పనులను ఏపీఓ గిరి హరీష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్ కూలీలకు పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సంద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రోజు కూలీ రూ.257 ఉండగా ప్రస్తుతం రూ.272కు పెంచడం జరిగందన్నారు. బ్లాక్ ప్లాంటేషన్‌లోని కండిత కందకాల వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని, వర్ష కాలంలో కందకాలల్లో నీళ్లు నిలిచి మొక్కల ఎదుగుదల ఉంటుందని వివరించారు. ఈకార్యక్రమంలో ఫిల్డ్ అసిస్టెంట్ అజ్మీర దేవేందర్, మేట్స్, కూలీలు ఉన్నారు.

మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి ఆత్మహత్య

టేకుమట్ల(రేగొండ): మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రేగొండ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన రావుల మహేందర్(28) అనే వ్యక్తి 10 సంవత్సరాల నుంచి మతిస్థిమితం కోల్పోయినాడన్నారు. మూడు నెలల క్రితం తల్లి మృతి చెందడంతో మరింతగా మతి స్థిమితం కోల్పోయి సోమవారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. గతంలో సైతం రెండు సార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు పేర్కొన్నారు.

గుడుంబా స్వాధీనం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగేడు వేశాలపల్లి రోడ్డు వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నాటు సారా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ రాం నరసింహారెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జంగేడు వేశాలపల్లి క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వేశాలపల్లి గ్రామ శివారు పెద్దకుంటపల్లి తండాకు చెందిన అజ్మీరా సుధాకర్ అనే వ్యక్తి ఒక నంబర్ లేని మోటార్ సైకిల్‌పై 10 లీటర్ల గుడుంబాను అనుమానం రాకుండా పెరుగు క్యాన్ లో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని నిందుతుడిపై కేసు నమోదు చేశామన్నారు. నాటు సారా విక్రయాలకు గాని, రవాణాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామనిసీఐ రాం నర్సింహరెడ్డి హెచ్చరించారు.

తొమ్మిది లీటర్ల గుడుంబా..

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన మాచర్ల శంకర్ అనే వ్యక్తి అక్రమంగా తొమ్మిది లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై ఎండీ షాఖాన్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నైన్‌పాక గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా అటుగా వెళ్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా అనుమానం వచ్చి అతనిని పట్టుకుని అతని వద్ద ఉన్న సంచిలో చూడగా అతను గుడంబా తరలిస్తున్నాడు. దీంతో గుడుంబాను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది మధుసూదన్,లాల్‌సింగ్, అస్లాం జానీ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

ములుగు రూరల్(గోవిందరావుపేట): వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించిన శివశంకర్ ఇటీవల మృతు చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య సోమవారం పరామర్శించారు. తోటి ఉద్యోగులు అందరి సహకారంతో పోగు చేసిన రూ.16 వేలను ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ పవన్, డాక్టర్ సుకుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన


భూపాలపల్లి రూరల్: ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు


మల్హర్‌లో..

భూపాలపల్లి రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, కారోబార్లు, బిల్ కలెక్టర్లు, పంప్ ఆపరేటర్లు ఎలక్ట్రీషన్లు తమ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి కుడుదుల వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీఓ నాగారాజుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ డిమాండ్లతో కూడిన మెమోరండం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎండీ ఖాజా, జిల్లా గౌరవ అధ్యక్షుడు అశోక్, రాష్ట్ర జేఏసీ కమిటీ సభ్యులు పూర్ణ తిరుపతి, జితేందర్, శ్రీకాంత్, వడ్లపూడి తిరుపతి, సమ్మక్క, సారమ్మ, సుభద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ సిబ్బంది మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి, నిరసన కార్యాక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సిబ్బంది వేతనాల కోసం ప్రత్యేక గ్రాంటును కేటాయించాలని కోరారు. జీఓ 51ను సవరించి, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్‌కు స్పెషల్ స్టేటస్ కల్పించి, పంచాయతీ అసిస్టెంట్‌గా నామకరణం చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, 8గంటల పనిదినాలు అమలు చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓ నరిసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కారోబార్లు నార శేఖర్, సాదుల శ్రీకాంత్, అజ్మత్ అలీ, జాగిలపు శ్రీకాంత్, విజ్జగిరి బాపు, అజ్మీర్‌పాషా, బోనోతు తిరుపతి, కసుకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మహాముత్తారంలో..

మహాముత్తారం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ వర్కర్లు, కారోబార్లు, బిల్‌కలెక్టర్లు, స్వీపర్లు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓకు వినతి పత్రం అందజేశారు. గ్రామ పంచాయితీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కారోబార్లు, బిల్‌కలెక్టర్లు, వాహన డ్రైవర్లు తదితరులు ఉన్నారు.

అశ్రిత్‌కు సన్మానం


అశ్రిత్‌ను సన్మానిస్తున్న సత్యనారాయణరావు

చిట్యాల: మండలంలోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన శ్రీసాయి అశ్రిత్ సివిల్ ఫలితాల్లో 40వ ర్యాంకు సాధించగా టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్‌పార్టీ నియోజకర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ రావు అభినందించారు. ఈ సందర్భంగా అశ్రిత్‌కు శాలువా కప్పి సన్మానిచారు. ఆయన వెంట జిల్లా నాయకులు, చింతకుంట రామయ్యపల్లి సర్పంచ్ మోకిరాల మధువంశీకృష్ణ, మొగుళ్లపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోలినేని లింగారావు ఉన్నారు.